క్లుప్తంగా

నున్నలో రోడ్డు కమ్ డ్రెయిన్ నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజీ రోడ్డులో గ్రామ పంచాయతీ నిధులు రూ.9 లక్షలతో రోడ్డు కమ్ డ్రెయిన్ నిర్మిస్తున్నట్లు ఏఈ పీఆర్ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. 175 మీటర్ల పొడవు, 3 మీటర్ల వెడల్పుతో సిమెంటు రోడ్డు 4 లక్షలతో, 5 లక్షలతో 150 మీటర్ల పొడవుతో రెండు వైపులా డ్రెయినేజీ నిర్మిస్తున్నారు. బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత డ్రెయినేజీ నిర్మాణం పనులు పరిశీలించి, డ్రెయిన్ కొలతలు తీశారు. అభివృద్ధి పనులకు గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు తెలిపారు.

గృహాల మంజూరుకు దరఖాస్తు చేసుకోండి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 (పీఎంఏవైయూ) పథకం కింద అర్హులైన వారికి గృహాలు మంజూరు చేస్తామని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ తాడిగడప మున్సిపాలిటీకి 600 గృహాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.2.40 లక్షలు చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. లబ్ధిదారులు మున్సిపాలిటీ పరిధిలో ఉండి పక్కా గృహం లేకుంటే వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. లబ్ధిదారులు వారు నివశించే ప్రాంతంలో ఉండే సచివాలయంలో కాని హౌసింగ్ ఏఈకి దరఖాస్తు అందించాలన్నారు. లబ్ధిదారులు కుటుంబ ఆధార్ జిరాక్స్, స్థలం డాక్యుమెంట్లు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, దంపతుల బ్యాంకు అకౌంట్, జాయింట్ ఫొటో, లబ్ధిదారుని సంతకం, ఫోన్ నంబర్ వివరాలు అందజేయాలని చెప్పారు.

మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



పెనమలూరు: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ సూచించారు. ఆమె బుధవారం పోరంకి, కానూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. రైతులు వెంటనే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. వేప సంబంధిత మందులు(1500 పీపీఎం)ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. దీని వలన తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా, పెట్టిన గుడ్లు పొదగకుండా పిల్ల పురుగు ఉధృతి తగ్గించవచ్చన్నారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే స్పైనిటోరం 200 మి.లీ లేదా స్పైనోసాడ్ 60 మి.లీ., లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కత్తెర పురుగు నివారణలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు షైమీ, సుష్మా, రైతులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో వక్ఫ్ భూముల సర్వే



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉన్న వక్ఫ్ భూములను బుధవారం సర్వే చేశారు. గ్రామంలో ఆర్ఎస్ నంబర్ 87లో 12.59 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 93లో 9.63 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అధికారులు సర్వే చేసిన అనంతరం పొలం హద్దులు ఏర్పాటు చేశారు. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎండీ నూహుఅలీషా, వీఆర్వో జీవా, విలేజ్ సర్వేయర్ శ్రీనివాస్, ఖాజీ ఎండీ హబీబుల్లాహసన్, వక్ఫ్ సర్వేయర్ షేక్.ఆశిక్, సిబ్బంది ఎండీ కరీముల్లా పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



వజ్రమ్మ(ఫైల్)

ఉంగుటూరు: స్వాతంత్ర్య సమరయోధుడు పిడికిటి పూర్ణచంద్రరావు భార్య శతాధిక వృద్ధురాలు వజ్రమ్మ(102) మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొనేందుకు వజ్రమ్మ తన సహాయ సహకారాలు అందించారు. పూర్ణచంద్రరావు, వజ్రమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పూర్ణచంద్రరావు 77 ఏళ్లకు మరణించారు. వజ్రమ్మ జీవిత కాలం సంపూర్ణ ఆరోగ్యంతో తన పనులు తాను చేసుకుంటూ స్వగ్రామంలోనే ఉన్నారు. వారి ఇద్దరు కుమార్తెల సంతానంతో నాలుగు తరాలను చూశారు. నూట రెండేళ్ల జీవించిన వజ్రమ్మ మరణ వార్తను తెలుసుకున్న ప్రముఖులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

అధ్వానంగా పారిశుద్ధ్యం

- తాడిగడప మున్సిపాలిటీలో స్వాగతం పలుకుతున్న చెత్త కుప్పలు
- విజృంభిస్తున్న దోమలు
- సమ్మెతో పేరుకు పోయిన చెత్త నిల్వలు





కానూరులో పేరుకుపోయిన చెత్త కుప్పలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త కుప్పలు స్వాగతం పలుకుతున్నాయి. గత 13 రోజులుగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు జీతాల కోసం సమ్మె చేయటంతో మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వీధిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త తరలించటానికి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటంతో ప్రధాన వీధులు తీవ్ర దుర్గంధంతో దారుణంగా మారాయి. వివరాల్లోకి వెళితే తాడిగడప మున్సిపాలిటీలో కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప ప్రాంతాలు ఉన్నాయి. అయితే కానూరు, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో ప్రతి రోజు అధికంగా చెత్త వస్తుంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజు 115 టన్నుల చెత్త వస్తుందని అంచనా. అయితే చెత్త తరలించటానికి మున్సిపాలిటీ పరిధిలో 42 వ్యాన్‌లు ఉన్నాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద ఇవి పని చేస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యాన్ డ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించటంలేదు. దీంతో 13 రోజులుగా వ్యాన్ డ్రైవర్లు సమ్మెలో ఉన్నారు.

అనారోగ్య వాతావరణం..

వ్యాన్ డ్రైవర్ల సమ్మెతో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే ఉండిపోయాయి. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. అనారోగ్య వాతావరణం ఏర్పడింది. దోమలు విపరీతంగా పెరిగాయి. రాత్రి వేళల్లో ఇళ్లల్లో నుంచి జనాలు బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఫాగింగ్ కొట్టేవారు కనబడటం లేదు. పుష్ కార్టులతో(తోపుడు బండ్లు) చెత్త తరలిస్తున్నా అవి ఏమాత్రం సరిపోవటం లేదు. కానూరు, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. వ్యాన్ డ్రైవర్లకు జీతాలు ఇస్తేకాని చెత్త సమస్య తొలగే పరిస్థితి లేదు.

తూతూమంత్రంగా స్వచ్ఛ దివస్

తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం తూతూమంత్రంగా నిర్వహించారు. పరిశుభ్రతే స్వచ్ఛాంధ్ర లక్ష్యమని ఉన్నతాధికారులు ప్రకటనలు చేసినా తాడిగడప మున్సిపాలిటీలో మాత్రం చెత్త కుప్పలు తొలగించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్త కుప్పలను వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పరిస్థితులు ఇలాగే ఉంటే ప్రజల ఆరోగ్యం క్షీణించి పడకేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వివాదస్పదంగా పంచాయతీ అధికారుల తీరు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ అధికారుల తీరు వివాదస్పదమవుతోంది. సర్పంచ్ ఇష్టా, అఇష్టాలతో పని లేకుండా టీడీపీ నాయకుల ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ ఆదేశాల మేరకు సర్పంచ్ గదికి తాళాలు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల సౌలభ్యం కొరకు పంచాయతీ కార్యాలయం ప్రారంభం నుంచి మూసివేసే వరకు సర్పంచ్ గదిని తెరిచి ఉంచేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం సర్పంచ్ పంచాయతీ కార్యాలయానికి వచ్చినప్పుడు మాత్రమే తాళాలు తీస్తామని లేకుంటే మూసివేస్తామనడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. సమస్యలు ఫిర్యాదు చేసేందుకు, గ్రామంలో వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామస్తులు సర్పంచ్ గదిలో వేచి ఉండేవారు. ప్రస్తుతం వార్డు సభ్యులు, గ్రామస్తులు కార్యాలయానికి ఎప్పుడు వచ్చిన వేసి ఉన్న తాళాలే దర్శనం ఇస్తుండటంతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. కనీసం వార్డు, ఎంపీటీసీ సభ్యులు వచ్చిన తాళాలు తీయడానికి కార్యదర్శి అనుమతి ఇవ్వకపోవడంతో వివాదం జరుగుతోంది. ఇప్పటి వరకూ మండలంలో ఏ గ్రామంలో కూడా లేని సంస్కృతిని టీడీపీ నాయకుల ఒత్తిడితో ఈ గ్రామంలో అమలు చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓకు పలువురు వార్డు సభ్యులు, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ గదికి తాళాలు తీసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నట్టల నివారణతో జీవాల సంరక్షణ

గ్రామాల్లో కొనసాగుతున్న పశు వైద్యశిబిరాలు



వేల్పూరులో నట్టల నివారణ మందు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ మాధవరావు



పొణుకుమాడులో మందులు అందజేస్తున్న సర్పంచ్ అన్నే సుబ్బలక్ష్మి, డాక్టర్ స్వర్ణలత

కంకిపాడు: నట్టల నివారణతో జీవాల సంరక్షణ సాధ్యమవుతుందని ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కర్నాటి మాధవరావు తెలిపారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో పశు వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. 1800 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 40 పశువులకు చూడి పరీక్షలు జరిపించారు. డాక్టర్ మాధవరావు మాట్లాడుతూ.. సకాలంలో జీవాలు, పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. పశు, జీవాల సంరక్షణలో మెలకువలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాలను ఉపయోగించుకోవాలి

అంబాపురం(విజయవాడరూరల్): ఉచిత పశు వైద్యశిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ డివిజన్ పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రమేష్ సూచించారు. అంబాపురం గ్రామంలో బుధవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాడి పశువులకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లల్లో జబ్బులు రాకుండా ముందస్తు చర్యగా వాక్సినేషన్లు పశుసంవర్ధక శాఖ సిబ్బంది వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ డి.హరీష్, టీడీపీ మండల అధ్యక్షుడు జి.చిన రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో..

గన్నవరంరూరల్: పశు వైద్యశిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ డాక్టర్ ఎంవీ బాలకృష్ణరావు తెలిపారు. మండలంలోని పురుషోత్తపట్నం గ్రంథాలయం సమీపంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యాన బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని గేదెలకు, మేకలు, గొర్రెలు, కోళ్లకు వైద్య సేవలు అందించామన్నారు. 25 పశువులకు గైనిక్ కేసులు 22 జనరల్, 25 దూడలకు, 110 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు, 105 కోళ్లకు యాంటీ బయోటిక్ మందులు ఇచ్చామన్నారు. సర్పంచ్ మాదల రోహిణి, ముస్తాబాద పశువైద్యశాల డాక్టర్ మేరీ వైడూర్యం, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గొల్లనపల్లిలో పశువైద్య నిర్వహించి 20 జనరల్ కేసులు 21 గైనిక్ కేసులు పరిశీలించి మందులు అందజేశారు. 40 దూడలకు, 120 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు, 180 కోళ్లకు యాంటీ బయోటిక్ మందులు ఇచ్చామన్నారు. డాక్టర్ బి.రెడ్డెమ్మ, ఉప సర్పంచ్ యనమదల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

100 గొర్రెలకు టీకాలు

ఉంగుటూరు: మండలంలోని వేంపాడు, పొణుకుమాడు గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు బుధవారం నిర్వహించారు. పొణుకుమాడులో ఉంగుటూరు పశువైద్య అధికారి స్వర్ణలత 30 పశువులకు చికిత్స, 120 గొర్రెలు, మేకలు, 20 దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. అలాగే వేంపాడులో స్థానిక ల్యాబ్ సిబ్బందితో పేడ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందుపల్లి పశు వైద్యాధికారి జి.సుధీర్‌బాబు నేతృత్వంలో 62 పశువులకు గర్భకోశ వైద్యసేవలు, 100 గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం పశు పోషకులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అన్నే సుబ్బలక్ష్మి, శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలా అండగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామానికి చెందిన పదో వార్డు సభ్యురాలు షేక్ కుదానమ్మ చిన్న కుమారుడు షేక్ ఏసు ఇటీవల మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని బుధవారం వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. దేవభక్తుని చక్రవర్తి తన వంతు సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బిళ్ల వెంకటేశ్వరరావు, జి.కాళిదాసు, రాజేష్, చక్కా గోపి, జోజ్‌మేరీ, బాలకృష్ణ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మహిళలు ఆర్థిక అక్షరాస్యులైనప్పుడే కుటుంబ ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించగలరని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ప్రతినిధులు కె.రవి, ఎం.అజయ్ కుమార్, ఎస్.రమేష్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలో మమతల పందిరి సేవా సమితి ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నెలవారీ బడ్జెట్ రూపకల్పన, పొదుపు, డబ్బు నిర్వహణ, డిజిటల్ లావాదేవీలపై మహిళలు అవగాహన పెంపొందించుకోవాలని ప్రతినిధులు సూచించారు. బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నగదు లావాదేవీలు, ఏటీఎం సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో వారి పట్ల చైతన్యం కలిగి ఉండాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ల ద్వారా ఏటీఎం పిన్, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు అడిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికీ ఫోన్లలో వ్యక్తిగత, ఆర్థిక సమాచారం చెప్పరాదని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వెబ్‌సైట్, యాప్ లింకులు ఓపెన్ చేయటం ద్వారా డేటా చోరీ, హ్యాకింగ్ జరిగే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న పలు సామాజిక భద్రతా పథకాలను మహిళలకు వివరించారు. మమతల పందిరి సేవా సమితి అధ్యక్షుడు లంక రమేష్, సభ్యులు పునుకొల్లు తేజ, రాయి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి వర్గీకరణ చేయాలి



పురుషోత్తపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న మంద వేణు, నాయకులు

గన్నవరంరూరల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటంలో జాప్యం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద వేణు అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డప్పులు వేల గొంతుల సంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వర్గీకరణకు అనుకూలంగా ఉన్న ఇంకా మాదిగ ఉపకులాలు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కోట కృష్ణమోహన్, పి.దేవదాసు, చౌటపల్లి పృథ్వీ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో చెస్ పోటీలు



గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ బసవేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో చదరంగం ఆటను అభివృద్ధి చేయటంలో అకాడమీ వ్యవస్థాపకుడు బొబ్బా రత్నారావు ఎనలేని కృషి చేశారన్నారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో అదే స్ఫూర్తిని అతని కుమారుడు చెస్ అంతర్జాతీయ కోచ్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి వీఆర్ బొబ్బా కొనసాగించటం అభినందనీయమన్నారు. 92 మంది పోటీలకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. బొబ్బా రచన, విప్రో కంపెనీ ప్రతినిధి హస్మిత, కోనేరు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం షెడ్యూల్ ఏరియాలో స్థానిక ఆదివాసులకు ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. అరకు ఎన్నికల సభలో సీఎం చంద్రబాబు జీవో నంబర్-3 చట్టబద్ధతపై ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కె.చిన్నంనాయుడు అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సురేంద్ర మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతంలో జీఓ నంబర్-3 చట్టం వలన 19 డిపార్టుమెంట్లలో 34 రకాల ఉద్యోగ నియామకాలు స్థానిక ఆదివాసులకు హక్కుగా ఉండేవని, దానిని సుప్రీంకోర్టు 2020 మార్చిలో రద్దు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని నాడు అరకు ఎన్నికల సభలో నేటి సీఎం చంద్రబాబు ప్రకటించి ఆరు నెలలు గడిచినా జీఓ-3 చట్టబద్ధతకు అతీగతీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీలకు రిజర్వేషన్ చట్టబద్ధత చేసి ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, అప్పల నర్సయ్య, ఎ.అశోక్, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పాల్గొన్నారు.

బాలఏసు నవదిన ప్రార్థనలు ప్రారంభం



బాలఏసుకు పూజలు నిర్వహిస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్, ఫాదర్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక గుడివాడ రోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో అద్భుత బాలఏసు నవదిన ప్రార్థనలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ మేత్రాసనం ఫాదర్ మువ్వల ప్రసాద్ బాలఏసు జెండాను ఆవిష్కరించారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, దయ, శాంతి గుణాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని చెప్పారు. జేఎంజే సిస్టర్స్ బాలఏసు గీతాలను ఆలపించారు. ఆర్సీఎం చర్చి ఫాదర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమకు అక్కినేని సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు అందించిన అక్కినేని నాగేశ్వరరావు చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. అత్యుత్తమ నటుడు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో గల అక్కినేని విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం జరిగింది. సొసైటీ అధ్యక్షుడు బి.వసంత కుమార్ మాట్లాడుతూ 90 ఏళ్ల జీవిత కాలంలో 75 ఏళ్ల పాటు సినిమాలలో నటించిన అక్కినేని వంటి వ్యక్తి దేశంలో మరొకరు లేరని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడంలో అక్కినేని కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అక్కినేని వ్యక్తిగతంగా నాస్తికుడు అయినప్పటికీ ఎన్నో భక్తిరస సినిమాలలో అద్భుతంగా నటించి రక్తి కట్టించారన్నారు. అక్కినేని విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన శిల్ప కళారత్న దేవికారాణి శిల్ప కళా నైపుణ్యం ప్రశంసనీయమన్నారు. అక్కినేనితో తనకున్న పరిచయాన్ని ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి వివరించారు. సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, అక్కినేని అభిమానులు డాక్టర్ నాగమల్లిక, బోడి ఆంజనేయరాజు, స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇ.కృష్ణ ప్రసాద్, ప్రభల శ్రీనివాస్, ఎంవీ కృష్ణారావు, పీవీఎల్ఎన్ రాజు, ఎస్కే షఫీఉల్లా, ఆలిండియా అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు ఎస్.సర్వేశ్వరరావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కమ్మేసిన పొగ మంచు



ఉయ్యూరు - గురజాడ మధ్య డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో పొగ మంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలు దాటుతున్నా మంచు తెరలు వీడటం లేదు. ప్రధాన రహదారులన్నీ మంచుతో కమ్ముకుపోవటంతో వాహనదారులు లైట్లు వేసుకుని సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి. కశ్మీర్, లంబసింగిని తలపించేలా మంచు దుప్పటి పరుచుకుంటున్నా రహదారి మార్గం కనిపించక ప్రమాదాలు పలకరిస్తుండటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కంకిపాడు, ఉయ్యూరు, గన్నవరం ప్రాంతాల్లో బుధవారం కనిపించిన పొగమంచు దృశ్యాలను సాక్షి కెమెరాలో బంధించింది. - కంకిపాడు/ఉయ్యూరు/గన్నవరం



విజయవాడ - మచిలీపట్నం హైవేపై కమ్మేసిన పొగ మంచు



ఉయ్యూరు - మంటాడ రోడ్డులో లైట్ల వెలుగులో ప్రయాణిస్తున్న వాహనదారులు

■ తెలుగు కథానిక పోటీల్లో చాముండేశ్వరి ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యావికాస వాహిని సంస్థ ఈ నెల 12న కంకిపాడులో నిర్వహించిన తెలుగు కథానిక పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని ఎల్‌వీఎస్ చాముండేశ్వరి సత్తా చాటింది. ఆ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి నగదు బహుమతిని పొందినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ తెలిపారు. చాముండేశ్వరిని బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు, ఇతర అధ్యాపకులు అభినందించారు.